ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 133 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 22 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్





ఉక్రెయిన్‌లో శాంతి
## తిరిగిరావాలి
### మోదీ పోలండ్, కీవ్ పర్యటన

న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం విదేశీ పర్యటనకు బయల్దేరారు. నేటినుంచి మూడు రోజుల పాటు ఆయన పోలండ్, ఉక్రెయిన్ దేశాల్లో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. "మధ్య ఐరోపాలో భారత్‌కు పోలండ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఉంది. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పోలండ్ అధ్యక్షుడు ..మిగతా 2లో

పారదర్శకంగా.. వేగంగా
# భూసేకరణ



### ఏరోజుకారోజు... వివరాలు అందించాలి
### దక్షిణ ప్రాంతంలో భూసేకరణకు దిగాలి
### ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్లు తదితర పనులపై ఆరా
### ట్రిపుల్ ఆర్‌పై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

హైదరాబాద్, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) కోసం భూసేకరణను పారదర్శకంగా, వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు.. పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనకు అందజేయా లన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం,ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి, ఆమన్‌గల్, షాద్‌నగర్,చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ..మిగతా 2లో



జన్వాడ ఫామ్ హౌస్
## లీజు మాత్రమే

### నాకు సొంతంగా ఫామ్‌హౌజ్‌లు లేవు
### అది అక్రమమైతే దగ్గరుండి కూల్చేయిస్తా
### మంత్రుల పామ్ హౌజ్‌ల నుంచే కూల్చివేతలు సాగాలి
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): జన్వాడ ఫామ్ హౌస్ అక్రమంగా ఉంటే కూల్చేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కేవలం తాను లీజుకు మాత్రమే తీసుకున్నానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కూల్చివేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో స్పందించారు. తన పేరుతో ఫామ్ హౌస్ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మిత్రుడికి చెందిన ఫామ్ హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. గత కొన్ని నెలలుగా తాను అక్కడే ..మిగతా 2లో

జన్వాడ ఫామ్‌హౌజ్
## కూల్చివేతపై స్టే నిరాకరణ
### కూల్చివేతలపై హైడ్రా పరిధిని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఫాంహౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం.. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ..మిగతా 2లో

## రేవంత్ పాప పరిహారం కోసం ప్రార్థిస్తా
### రుణమాఫీ పేరుతో దేవుళ్లపై ఒట్టేసుకున్న సీఎం
### యాదాద్రిలో ప్రత్యేక పూజలు చేయిస్తానన్న హరీష్ రావు



హైదరాబాద్, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం ప్రజలకు శాపం కాకుండా చూసి రక్షించాలని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహాస్వామిని ప్రార్థిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాప పరిహారం కోసం, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం గురువారం యాదాద్రి దేవాలయం దర్శించుకొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి పూజలు చేయబోతు న్నామని ఆయన చెప్పారు. ఈ పాపాత్ముడైన ముఖ్యమంత్రిని క్షమించు, తెలంగాణ ప్రజలపై దయ ఉంచు అని యాదగిరి నరసింహాస్వామిని వేడుకుంటామమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆగస్టు15 లోగా రైతులందరికి రుణమాఫీ ..మిగతా 2లో




కోల్‌కతా కేసులో
## డాక్టర్ల ఆందోళన
### ఆస్పత్రిలో విధ్వంసంపై నిర్లక్ష్యం
### ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసిన ప్రభుత్వం

కోల్‌కతా, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): : కోల్‌కతా కేసులో డాక్టర్ల ఆందోళ కొనసాగుతోంది. ఆర్జికర్ ఆస్పత్రి పై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఘటనలో ఇద్దరు ఏసీపీలు, ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న ఆరోపణలతో వేటు పడిరది. ఆస్పత్రిపై విధ్వంసం సృష్టించిన 40 మంది దుండగులు అరెస్టు అయ్యారు. కోల్‌కతా మెడికో హత్యాచార ఘటనకు సంబంధించి డాక్టర్ల ఆందోళన కొనసాగుతోంది. అలాగే ఈ ఘటనకు బాధ్యుల్కైన కొంతమందిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సంచాలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటికే కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే తాజాగా ఆర్జీకర్ ఆస్పత్రిపై అర్ధరాత్రి విధ్వంసం సృష్టించిన ఆందోళన కారులు 40 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అల్లర్లలో పాల్గొన్న మరికొంది కోసం సీసీటీవీ ఫూటేజీని పరిశీలిస్తున్నారు. ఈ విధ్వంస ఘటనను పోలీసులు నిలువరించలేకపోవడంతో ఇద్దరు ఏసీపీలు, ఎస్ఐలు సస్పెండ్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సుప్రీం కోర్టులో వాదనలు జరిగాయి. ఆస్పత్రుల్లో వైద్యుల భద్రత కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు సుప్రీంకోర్టు ..మిగతా 2లో

## కాశ్మీర్ ఎన్నికలపై బీజేపీ దృష్టి
### కిషన్‌రెడ్డి, రాంబాధవ్‌లకు ఎన్నికల బాధ్యతలు



న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌ను బీజేపీ అధిష్ఠానం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశలు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 18న తొలిదశ, 25న రెండోదశ, అక్టోబర్ ఒకటిన మూడో దశ ఎన్నికలు జరుగనుండగా.. అక్టోబర్ 4న ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ..మిగతా 2లో

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్‌కు
## ఉత్తమ ర్యాంక్
### సత్తాకు ఇది నిదర్శనమని అభినందించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా వరుసగా రెండోసారీ ఎంపికైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఇది ఆయనలోని నాయ కత్వానికి లభించిన గుర్తింపుగా కొనియాడారు. ఈ ఘనత సాధించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు అభినందనలు. అది కూడా రెండోసారి. ఆర్‌బీఐలో ఆయన నాయకత్వానికి; ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని నిర్ధరించే దిశగా ఆయన చేసిన కృషికి ఇది గుర్తింపు అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగ్‌జైన్ ఇచ్చిన ర్యాంకుల్లో శక్తికాంత దాస్‌కు అగ్రస్థానం దక్కింది. గ్లోబల్‌సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2024లో శక్తికాంత దాస్‌కు 'ఏ' రేటింగ్ లభించిందని ..మిగతా 2లో

## జన్వాడ ఫామ్‌హౌజ్ నీది కాకుంటే యాగీ ఎందుకు చేశావ్?
### పేదల ఇళ్లను కాదు..దొరబాబుల ఇళ్లను హైడ్రా కూల్చాలి
### పార్టీలోకి ఎవరు వచ్చినా చేర్చుకుంటామన్న బండి



ఆగస్ట్ 21 (ప్రభాత ఉదయం): జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌ది కాకుంటే గతంలో రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసు నమోదు చేశారో చెప్పాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఫామ్ హౌస్ సొంతం.. ఇప్పుడు లీజు తీసుకున్నారా అని కెటిఆర్‌ను నిలదీశారు. అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌ల కూల్చివేతను సమర్థించారు. గజాల్లో కట్టిన ఇళ్లను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారని తెలిపారు. భారీ భవన యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా కలెక్షన్ల కోసమేనని బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు చేశారు. ఆయన ఒక్కడే అమాయకుడు అనేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల కోసం డబ్బులు పంపాలని సీఎం రేవంత్ రెడ్డికి హైకమాండ్ ..మిగతా 2లో

# జన్వాడ ఫామ్ హౌస్ లీజు మాత్రమే

మొదటి పేజీ తరువాయి...





నివసిస్తున్నట్లు చెప్పారు. జన్వాడలోని ఈ ఫామ్ హౌస్ నిబంధనల ప్రకారం లేకుంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఈ ఫామ్ హౌస్ నిర్మించి ఉంటే.. దానిని కూల్చివేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కెవిపి రామచంద్రరావు, మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ తదితరులకు ఫామ్ హౌస్‌లున్నాయన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ ఎక్కడ ఉందో కూడా తాను చూపిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా ఉందని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. పొంగులేటి సోదరుడు ప్రస్తుతం అదే ఫామ్ హౌస్‌లో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించారా? అంటూ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లోని కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్ళి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్ హౌజం ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒక వేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.ముందు మంత్రుల ఫామ్ హౌస్‌ల కూల్చివేతతోనే వీటిని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు జన్వాడలో ఫామ్ హౌస్ కూల్చవద్దంటూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత ప్రదీప్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగర శివారుల్లో పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వీటిపై హైడ్రా ఫోకస్ పట్టింది. ఈ ఫామ్ హౌస్‌లు నిబంధనల మేరకు నిర్మించారా? లేక 111 జీవోను ఉల్లంఘించారా? అనే కోణంలో ఓ వైపు హైడ్రా, మరోవైపు ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి.. వివరాలు సేకరిస్తున్నారు. ఓ వేళ నిబంధనలు పట్టించుకోకుండా నిర్మిస్తే... వాటిని కూల్చివేసేందుకు ఐపీఎస్ అధికారి ఎ.వి.రంగనాథ్ సారథ్యంలో 'హైడ్రా' తన పని తాను చేసుకొంటూ ముందుకు వెళ్తుందనే ఓ చర్చ సైతం సాగుతుంది.



## పారదర్శకంగా..
# వేగంగా భూసేకరణ

మొదటి పేజీ తరువాయి...

ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.



## ఉక్రెయిన్‌లో శాంతి
# తిరిగిరావాలి

మొదటి పేజీ తరువాయి...

ఆండ్రెజ్ దుడా, ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో నా భేటీ కోసం ఎదురుచూస్తున్నా. అక్కడి భారతీయులతోనూ ముచ్చటించనున్నా. ఆ పర్యటనను ముగించుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు కీవ్ వెళ్లనున్నా. ఆ దేశంలో భారత ప్రధాని చేపట్టబోయే తొలి పర్యటన ఇదే కానుంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడమే ప్రధానాంశంగా ఈ పర్యటన సాగనుంది. గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారంపై జెలెన్‌స్కీతో నా ఆలోచనలు పంచుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. అక్కడ శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగిరావాలని ఆకాంక్షిస్తున్నా" అని మోదీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. తన విదేశీ పర్యటన రెండు దేశాలతో విస్తృతమైన సంబంధాలకు ఉపయోగపడుతుందని, రాబోయే సంవత్సరాల్లో మరింత శక్తివంతమైన బంధాన్ని నెలకొల్పడానికి సహాయపడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. భారత్, పోలండ్ మధ్య దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని ఈ పర్యటన చేపట్టారు. 45 ఏళ్ల తర్వాత ఆ దేశానికి వెళ్తున్న తొలి భారత ప్రధాని ఈయనే కావడం విశేషం. చివరిసారిగా 1979లో నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలండ్‌ను సందర్శించారు. ఇక, గత రెండేళ్లుగా ఉక్రెయిన్, రష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మోదీ కీవ్ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ నేడు పోలండ్‌లో పర్యటిస్తారు. అక్కడి నుంచి ఆగస్టు 23న ప్రత్యేక రైలులో సుమారు 10 గంటలు ప్రయాణించి కీవ్ చేరుకుంటారు. జెలెన్‌స్కీతో సమావేశమై తిరిగి మళ్లీ రైలు మార్గంలో పోలండ్ చేరుకుంటారు. అనంతరం పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొస్తారు.

# కాశ్మీర్ ఎన్నికలపై బిజెపి దృష్టి

మొదటి పేజీ తరువాయి...

ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించారని.. నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మాధవ్ 2014-20 కాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. జమ్మూ కశ్మీర్, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల రాజకీయ వ్యవహారాలను నిర్వహించే బాధ్యత ఆయనది. సెప్టెంబర్ 26, 2020న పునర్వ్యవస్థీకరణలో భాగంగా బీజేపీ ఆయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది.

## ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్‌దాస్‌కు
# ఉత్తమ ర్యాంక్

మొదటి పేజీ తరువాయి...

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఏ రేటింగ్‌ను ప్రపంచంలో ముగ్గురు కేంద్ర బ్యాంక్ గవర్నర్‌లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారు. ద్రవ్యోల్బణం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక స్థిరత్వం, వడ్డీ రేట్ల నిర్వహణ ఆధారంగా కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్‌లను కేటాయించారు. అద్భుత పనితీరుకు ఏ, అధ్వాన పనితీరుకు ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. ఏ? రేటింగ్ పొందిన కేంద్ర బ్యాంకర్లలో డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ కెటెల్ థామసన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జే జోర్డాన్ ఉన్నారు.




## కోల్‌కతా కేసులో
# డాక్టర్ల ఆందోళన

మొదటి పేజీ తరువాయి...

తొమ్మిది మంది సభ్యులతో కూడిన జాతీయ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆస్పత్రిలో తీవ్ర సంచలనం సృష్టించిన జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. టాస్క్‌ఫోర్స్‌లో హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రుల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డికి చోటు కల్పించింది. పని ప్రదేశాల్లో వైద్యులపై లైంగిక పరమైన హింసను నివారించేందుకు.. వైద్యులు, నర్సులకు భద్రత, గౌరవప్రదమైన పరిస్థితులు కల్పించడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఎన్‌టీఎఫ్‌కు నిర్దేశిరచింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్, తన మధ్యంతర నివేదికను మూడు వారాల్లోగా.. పూర్తిస్థాయి నివేదికను రెండు నెలల్లోగా సమర్పించాలని ఆదేశించింది. టాస్క్‌ఫోర్స్‌కు కేంద్ర క్యాబినెట్, హోంశాఖ, ఆరోగ్యశాఖ కార్యదర్శులు.. జాతీయ వైద్యమండలి (ఎన్‌ఎంసీ) ఛైర్‌పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రెసిడెంట్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని ధర్మాసనం పేర్కొంది. వైద్యులపై భౌతికదాడులు, లైంగిక హింసకు సంబంధించి వైద్యసంస్థలు తమకు తాము ఎలాంటి నిబంధనలను రూపొందించుకోకపోవడం తీవ్ర ఆందోళనకరం అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. వైద్యుల భద్రత కోసం చట్టాలు ఉన్నాయని.. అయితే అవి వ్యవస్థాగత సమస్య (సిస్టమెటిక్ ఇష్యూస్)లను పరిష్కరించలేవు అని వ్యాఖ్యానించింది. పనిచేసే చోట వైద్యులకు భద్రతాలేమిపై సుప్రీం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. క్షేత్రస్థాయిలో మార్పులు తెచ్చేందదుకు మరో అత్యాచారమో.. హత్యో జరిగేదాకా ఎదురుచూడకూడదు అని కోర్టు వ్యాఖ్యానించింది. ఆర్జీకర్ ఆస్పత్రిలో హత్యాచారం, హత్యకు గురైన జూనియర్ వైద్యురాలి పేర్లు, ఫొటోలు, వీడియోలను తక్షణమే సామాజిక మాధ్యమాల్లోంచి తొలగించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యులు.. ఆందోళనలను విరమించి, ఎప్పటిలాగే వైద్యసేవలు కొనసాగించాలని అప్పీలు చేసింది. వైద్యుల సమ్మెతో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. 'వైద్యుల భద్రతపై భరోసా కల్పించేందుకు మేం ఉన్నాం.. ప్లీజ్ మమ్మల్ని నమ్మండి' అని వైద్యులను ఉద్దేశించి పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఢిల్లీలోని ఆర్ఎంఎల్ ఆస్పత్రి వైద్యులు తమ సమ్మెకు ముగింపు పలికారు. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార కేసును సుమోటోగా స్వీకరించడాన్ని రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. మరోవైపు.. ఆర్జీ కర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపేందుకు స్వామి వివేకానంద స్టేట్ పోలీస్ అకాడమీ ఐజీ డాక్టర్ ప్రణవ్ కుమార్ సారథ్యంలో నాలుగు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) బెంగాల్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## జన్వాడ ఫామ్‌హౌజ్ నీది కాకుంటే
# యాగీ ఎందుకు చేశావ్?

మొదటి పేజీ తరువాయి...

టాగట్ విధించిందని సంచలన ఆరోపణలు చేశారు. ఆ క్రమంలో హైడ్రా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. భారతీయ జనతా పార్టీలో చేరికలకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి, ఎవరొచ్చినా సరే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు, మిగతా నేతలు ఎవరొచ్చినా సరేనని అన్నారు. హరీశ్ రావు పార్టీ మార్పు గురించి గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి పేరును బండి సంజయ్ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ పార్టీ ఎందుకు దూరంగా ఉందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పార్టీకి లాభం చేసేందుకు కాదా అని అడిగారు. లిక్కర్ కేసులో అరెస్టైన కవిత బెయిల్ కోసం అభిషేక్ మను సింఘ్వీ తీవ్రంగా కృషి చేశారని.. అందుకోసం ఆయనను రాజ్యసభకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పంపిస్తున్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. కేసీఆర్ చెప్పినట్టే నడుస్తోందని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. మరికొన్ని రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అవడం ఖాయం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం ఉందని, అందుకోసమే విగ్రహాల గొడవ తెరపైకి తీసుకొచ్చారని కేంద్రమంత్రి బండి సంజయ్ గుర్తుచేశారు. ఆరు గ్యారంటీల అమలు గురించి ఎక్కడ ప్రశ్నిస్తామోనని ముందుగా విగ్రహాల అంశాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. సచివాలయం ముందు మాజీ ప్రధాని వాజ్ పేయి విగ్రహం నెలకొల్పాలని తమకు ఉంది. ప్రజా సమస్యల పరిష్కరించడం మంచిదని సూచించారు. విగ్రహాల అంశాన్ని పక్కనపెట్టి, పరిపాలనపై దృష్టిసారించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.



## జన్వాడ ఫామ్‌హౌజ్
# కూల్చివేతపై స్టే నిరాకరణ

మొదటి పేజీ తరువాయి...

ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీ ధర్మాసనం సూచించింది. హైడ్రా కూల్చివేతలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇప్పటి వరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది, ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా? దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని తెలిపారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కోరారు. 2014లో జన్వాడలో ఫాంహౌస్ ఏర్పాటు చేశారని, 2019లో ప్రదీప్ ఫామ్‌హౌజ్ కొనుగోలు చేసినట్టు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫాంహౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా? అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని సూచించింది. ప్రాథమికంగా నోటిఫై చేశామని.. తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

## రేవంత్ పాపపరిహారం కోసం
# ప్రార్థిస్తా

మొదటి పేజీ తరువాయి...

చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి మీద ఒట్టు పెట్టి మాట తప్పారు. రూ. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలు ఉన్నాయని డిసెంబర్ నెలలో చెప్పారు. కడుపు కట్టుకుంటే చాలు ఒక్క ఏడాదిలో రూ. 40 వేల కోట్ల రుణమాఫీ చేస్తానని జనవరిలో అన్నారు. కేబినెట్‌లో నిర్ణయించిన రూ. 31 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ఒట్లు పెట్టారు. మొన్నటి బ్జడెట్ కేటాయింపుల్లో రూ. 26 వేల కోట్లకు కుదించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆగస్టు15 నాడు రుణమాఫీ పూర్తయిందని చెప్పి రూ. 17 వేల కోట్లన్నారు. రుణమాఫీ చేశామని ముఖ్యమంత్రి చెబుతుంటే మరోవైపు మంత్రులు కాలేదు అంటున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రుణమాఫీ పూర్తిగా జరగలేదని, మిగిలిన రూ. 12 వేల కోట్లు కూడా విడుదల చేస్తామని ప్రకటించారు. మరో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 17 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని అంటున్నారు. ఇందులో ఎవరి మాట నిజమో తెలియక, రుణమాఫీ కాక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకులు, కలెక్టరేట్ల చూట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. కోతల ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసేందుకు రేపు ఆలేరులో నిర్వహించే ధర్నాలో పాల్గొంటాను. రైతలందరి తరుపునా ఈ ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడుగుతామని హరీశ్‌రావు తేల్చిచెప్పారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు: శేరి సతీష్ రెడ్డి



## షేర్ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

### ప్రభుత్వ పథకాలను చూసి చేరిన వివిధ పార్టీల నాయకులు జిల్లా అధ్యక్షులు, కూకట్ పల్లి ఇన్చార్జి సారాధ్యంలో త్వరలో చేరికలు

కూకట్‌పల్లి, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. బుధవారం కెపిహెచ్బి లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో పాలన ప్రజాభిష్టం మేరకు కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డితో చర్చలు జరిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింత మైలేజ్ వచ్చే క్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో కలిపి సుమారు 1000 మంది యువత కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సంసిద్ధంగా ఉందని అన్నారు. శేరి సతీష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే వారికి పార్టీ ప్రతిష్టకు కృషి చేస్తే భవిష్యత్తులో వారికి రాజకీయ అవకాశాలు వస్తాయని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అభిమానులు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రజల ఆశీర్వాదంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించగలరని శేరి సతీష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు క్రిస్టియన్ మైనార్టీ మేకల మైకల్, దేవ సహాయం రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ అరవింద్ రెడ్డి, లుంగీ రాజు, రాజు ముదిరాజ్, శేషగిరిరావు, కొమ్మ బాబు, సన్నీ, గణేష్, శివారెడ్డి,సంతోష్, సోను, తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడి టీచర్లు

## అంగన్వాడిల రిటైర్మెంట్ కొత్త జీవో విడుదల చేయాలి

కొత్తకోట, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో అంగన్వాడి టీచర్స్ ,హెల్పర్స్ కు నష్టం కలిగించే జీవో నెంబర్ 10 ని రద్దు చేయాలని అంగన్వాడి టీచర్స్ హెల్పర్లకు రిటర్మెంట్ బెనిఫిట్ కొరకు కొత్త జీవో ను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వాన్ని కోరారు. అంగన్వాడి టీచర్లు బుధవారం కొత్తకోట తాసిల్దారు వెంకటేశ్వర్లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి సమస్యల పరిష్కారం కోసం 2024 ఏప్రిల్ నుండి జూలై వరకు సమ్మె చేశాం జులై 16న ఐసిడిఎస్ మంత్రి సీతక్క జులై 19న ఐసిడిఎస్ డైరెక్టర్ అంగన్వాడీలకు రెండు రోజుల్లో కొత్త జీవో ఇస్తామని ప్రకటించారు కానీ నెలరోజులు గడుస్తున్నా నేటికీ కొత్త జీవో ప్రభుత్వం జారీ చేయలేదుఅన్ని చెప్పారు. జులై 1 నుండి విధుల నుండి తొలగించబడి నా రిటైర్మెంట్ అయినా హెల్పర్లకు టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వకపోవడంతో ఎలాంటి ఉపయోగం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట మీద నిలబడకపోవడం కొత్త జీవో ఆలస్యం కావడంతో అంగన్వాడి ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. వెంటనే అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కొత్త జీవోను విడుదల చేయాలని అంగన్వాడీలను అందరిని పర్మనెంట్ చేయాలని ఆయన కోరారు. అంగన్వాడి కేంద్రాలకు బాత్రూం మంచినీటి సౌకర్యం కరెంటు కాంపౌండ్ వాల్స్ లేకపోవడంతో ఇబ్బందుల కు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఆరోగ్య లక్ష్మి మెస్ ఛార్జీలు పెంచడం లేదని కనీస సౌకర్యాలైన అంగన్వాడి కేంద్రాలలో టేబుల్స్ కుర్చీలు బీరువాలు సరిపడా వంట పాత్రలు ఇవ్వట్లేదని ఆయన ఆరోపించారు.కూరగాయలు సోప్స్ చీపుర్లు బిందెలు బకెట్లు పంపిణీ చేయకపోవడం మరి దారుణమని ఆయన అన్నారు కోడిగుడ్లు ప్రభుత్వం సప్లై చేస్తుంది కానీ 50 గ్రాముల గుడ్డు అసలు సప్లై చేయడం లేదని అతి చిన్నవి పిట్ట గుడ్ల లాంటివి సప్లై చేస్తున్నారని ఆయన చెప్పారు ఐసిడిఎస్ తోపాటు బిఎల్ఓ డ్యూటీలు ప్రభుత్వం చెప్పే అనేక సర్వేలు చేస్తున్న అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వెంకటేశ్వరమ్మ, వనజ కుమారి, విజయలక్ష్మి, నిర్మల ,అలివేల,శోభ, పార్వతి, తస్లిం, శ్రీదేవి,అన్నపూర్ణ, కాళికా బాలేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెరువులపై మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

## చెరువులు కాలువలపై వెలుస్తున్న కట్టడాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు

### శంషాబాద్ కమిషనర్‌తో మాట్లాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


శంషాబాద్, ఆగస్టు 21( ప్రభాత ఉదయం): శంషాబాద్ లోని పలు చెరువులో కాలువలపై. ప్రభుత్వ దేవాదాయ శాఖ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ భారతీయ జనతా పార్టీ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫిర్యాదు చేశారు. దేవేందర్. కొండ పరమేష్ గౌడ్. రాజిరెడ్డి. సురేందర్. కొలను ప్రదీప్ రెడ్డి. కొలను జగ్జీవన్ రెడ్డి .మహిపాల్ రెడ్డి. విజయ భాస్కర్ రెడ్డి. సుదర్శన్ రెడ్డి. జనార్దన్ రెడ్డి తదితరులు బుధవారం హైడ్రా కమిషనర్ ను కలిసి ఫిర్యాదు చేశారు. శంషాబాద్ పట్టణ నడిబొడ్డులోని రాళ్లగూడ దోషికుంటలో చెరువును ఆక్రమించి ఏదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని. కాముని చెరువు సమీపంలో కాల్వపై పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయని . శాతం రాయి లోని యదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని వారు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు అందుకున్న రంగనాథ్ వెంటనే శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగినట్లు బిజెపి నాయకులు తెలిపారు. వెంటనే కబ్జాలకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు అందజేయాలని ఆయన ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు ను కలిసి బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు.

## వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన యూజి కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు పెంపు

బుద్వేల్, ఆగస్టు21(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదీని ఈనెల 29 వరకు పొడిగించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బై.పి.సి స్ట్రీమ్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునే తేదీని పెంచినట్లు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్. పి. రఘురామిరెడ్డి తెలిపారు. జూలై 12వ తేదీ నుంచి ఆగస్టు 17వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తొలి విడతలో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్సైట్ www.pjtsau.edu.inను సందర్శించాలని సూచించారు.

## మానసిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్య

బుద్వేల్, ఆగస్టు21(ప్రభాత ఉదయం): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అత్తాపూర్ రెడ్డి బస్తీలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి . అత్తాపూర్ రెడ్డి బస్తీలో నివాసం ఉండే ఒగ్గు వెంకటేష్ (46) స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. 15 సంవత్సరాల కిందట భార్య మరణించింది. ఆయన తల్లి కుమారుడు కార్తీక్ తో కలిసి నివాసం ఉంటున్నాడు. మానసిక ఇబ్బందులతో గతంలో రెండుసార్లు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు . మంగళవారం రాత్రి ఇంట్లో ఒక్కడే ఉన్న సమయంలో చీరతో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. కేసును అత్తాపూర్ ఇన్స్పెక్టర్ వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో ఎస్సై శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.



ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందిన ఒగ్గు వెంకటేష్



హసన్ నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్, గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న తదితరులు

## మీరాలం చెరువు చుట్టూ ఉన్న బస్తీలలోకి వరద నీరు రాకుండా చూడాలి

బుద్వేల్, ఆగస్టు21(ప్రభాత ఉదయం) వర్షాలు పడినప్పుడల్లా మీరాలం చెరువు పరివావాక ప్రాంతాలలో గల ఇండ్లలోకి వరద నీరు చేరుతుందని, వరద నీరు మీరాలం చెరువులోకి వెళ్లే విధంగా పనులు చేపట్టాలని శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్ కోరారు. బుధవారం దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న తో కలిసి ఆయన మీరాలం చెరువు చుట్టూరా ఉన్న నెక్లెస్ రోడ్డు పరి వాహక ప్రాంతాన్ని సందర్శించారు. వర్షం కారణంగా వచ్చే వరద మీరాలను చెరువులోకి వెళ్లేటట్లు చూడాలన్నారు. అందుకోసం ఔట్ లెట్ లను ఏర్పాటు చేయాలన్నారు. హసన్ నగర్, ఎన్టీఆర్ నగర్, మీరాలం నెక్లెస్ రోడ్ , ఇందిరా నగర్, మహమూద్ నగర్, జబెల్ నూర్ తదితర బస్తీలలో పర్యటించారు. కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు నవాజుద్దీన్ , హబీబ్ జైన్ ఆరిఫ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



మీరాలం చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న. చిత్రంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్



## మయాంక్ మిట్టల్ జలమండలి ఈడీగా బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్ట్ 21(ప్రభాత ఉదయం) జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా మయాంక్ మిట్టల్ బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేస్తున్న ఆయన ను రాష్ట్రప్రభుత్వం వాటర్ బోర్డుకు ఈడీగా బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆయన ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఎండీ అశోక్ రెడ్డిని ఆయన ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. జలమండలి ఉన్నతాధికారులు, ఉద్యోగులు సైతం నూతన ఈడీకి పుష్ప గుచ్ఛాలతో స్వాగతం పలికారు. మయాంక్ మిట్టల్ ఐఏఎస్-2020 బ్యాచ్ కి చెందిన అధికారి.

## నేడు మన్నె మహాత్మా రావుకు సన్మానం



బుద్వేల్, ఆగస్టు21(ప్రభాత ఉదయం): కవి, గాయకులు రచయిత మన్నె మహాత్మారావుకు ఈనెల 22న సాయంత్రం 6:30 గంటలకు రాజేంద్రనగర్ శ్రీ మాతా పోచమ్మ దేవాలయం ఆవరణలో లో సన్మానం చేయనున్నారు. శ్రీ మాతా పోచమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ సన్మానాన్ని చేపట్టారు. కవిగా నాయకునిగా నటన నైపుణ్యం కలిగిన వ్యక్తిగా చిన్ననాటి నుంచే మన్నె మహాత్మారావు కు పేరుంది. ఆయన శ్రీ రాఘవేంద్ర స్వామి నాటకం తో పాటు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రలకు సంబంధించిన నాటక ప్రదర్శనలో ఎంతో చక్కగా నటించారు. మన్నె మహాత్మాగావు అనేక ఆధ్యాత్మిక గీతాలు రచించి స్వయంగా పాడారు. వినాయక నవరాత్రులలో పాడే పాటలతో పాటు భజన పాటలు ఆయన ఎంతో చక్కగా పాడుతారని పేరుంది.

## రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి

బుద్వేల్, ఆగస్టు21(ప్రభాత ఉదయం): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం, పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్ ప్రెస్ వే 236 పిల్లర్ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం పడి ఉందన్న సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేయాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియా మార్చురీకి తరలించారు . మృతుడి వయసు 35 సంవత్సరాలు ఉంటుందని , మృతుడి శరీరంపై పింక్ కలర్ తో కూడిన చెక్స్ షర్టు , కాకి కలర్ ప్యాంటు ధరించినట్లు తెలిపారు. మృతుడి కుడి చేతి పై అమ్మా నాన్న అని, టీ ఎస్ కె అని పచ్చ బొట్టు ఉన్నాయని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు అత్తాపూర్ పోలీసులను సంప్రదించాలని కోరారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం




మృతిని చేతిపై టీ ఎస్ కె అని, అమ్మ నాన్న అని పచ్చ బొట్టు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

# బాలానగర్ డివిజన్ జోన్ పోలీసు అధికారుల సమీక్ష సమావేశం

**నిషేధిత మత్తు మత్తు పదార్థాలపైయువతకు అవగాహన కల్పించాలి: బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ బాలానగర్ డివిజన్ జోన్ పోలీసు అధికారుల సమీక్ష సమావేశం**



మత్తు పదార్థాలపై పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఉన్నతాధికారులు

కూకట్‌పల్లి, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ జోనచ పరిధిలోని నెలవారీ సమీక్షా సమావేశంలో బాలానగర్ డీసీపీ కార్యాలయంలో కె. సురేష్ కుమార్ నెలవారీ సమీక్షా సమావేశంలో బాలానగర్ పరిది లోని 8 పోలీసు స్టేషన్ సీఐలు, సిబ్బందితో బుధవారం నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఎన్డీ పీఎస్ గ్రేవ్ క్రైమ్ మీద రివ్యూ మరియు చీటింగ్, ల్యాండ్ కేసులు, ఎకామిక్ అఫెన్స్‌ఎస్ మీద తదితర రివ్యూలు ఎస్ఐ ల వారిగా ఉన్న కేసు ల గురించి నాన్ బెయిల్ వారింట్ల గురించి సస్పెక్ట్ షీట్, హిస్టరీ షీట్స్ గురించి, పెండింగ్ లో ఉన్న కేసుల గురుంచి కూలంకషంగా చర్చించి దిశా నిర్దేశం చేశారు. అంతే కాకుండా వచ్చే వినాయక చవితి సందర్భంగా ఆర్గనైజర్స్ తో సెక్టార్ వారీగా సమావేశాలను ఏర్పాటు చేయాలనీ సెక్టార్ ఎస్ ఐ లకు, ఎస్ హెచ్ ఓ లకు ఆదేశించారు. కమ్యూనిటీ పోలీస్ లో భాగంగా నిశేదిత డ్రగ్స్, మత్తు పదార్థాలు సైబర్ క్రైమ్ అవేర్నెస్ వంటి వాటి పై కాలేజ్ లు కమ్యూనిటీ ల లో యాంటీ డ్రగ్స్ టీమ్స్ ఏర్పాటు చేయాలని సెక్టార్ ఎస్ఐ లకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ సత్యనారాయణ, బాలానగర్ అడిషనల్ సి పి హనుమంతరావు, కూకట్ పల్లి ఏసిపి శ్రీనివాస్ రావు జోన్ అన్ని ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.




విద్యుత్ శాఖలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్ ఏ ఓ వీరస్వామి, అధికారులు సిబ్బంది

## విద్యుత్ శాఖలో పదోన్నతుల సంబరాలు

**సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్ లకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు**

మెహదీపట్నం, ఆగస్టు21(ప్రభాత ఉదయం) విద్యుత్ శాఖలో ప్రభుత్వం భారీ సంఖ్యలో పదోన్నతులు కల్పించిన సందర్భంగా అధికారులు, సిబ్బంది సంబరాలు జరుపుకుంటున్నారు. బుధవారం మెహిదీపట్నం నానల్ నగర్ చౌరస్తాలో గల రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో పదోన్నతులు ఇచ్చిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, సిఎండి ముషారఫ్ ల చిత్రపటాలకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి,ఎస్ ఏ ఓ వీరస్వామి మాట్లాడుతూ... ప్రభుత్వం గతంలో ఎప్పుడు చేయని విధంగా విద్యుత్ శాఖలో పదోన్నతులు కల్పించి న్యాయం చేయటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజ్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ అనిల్ రెడ్డి, మాణిక్ రావు, ఆర్టిజన్లు వేణు, శ్రీశైలం, రఘు, రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

### మహిళా డాక్టర్ పై హత్యాచార ఘటన

## నిందితులను కఠినంగా శిక్షించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(ప్రభాత ఉదయం)కోల్‌కతా ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ విద్యార్థిని అత్యాచారం, హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత, గద్వాల మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కోల్‌కత మహిళా డాక్టర్ పై జరిగిన ఘటనకు నిరసనగా వైద్యులు, వైద్య సిబ్బంది చేపడుతున్న నిరసన కార్యక్రమానికి వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో వైద్య సిబ్బందికి, మహిళలకు భద్రత లేకపోవడం వ్యవస్థ వైఫల్యమేనని విమర్శించారు. ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో డాక్టర్లకు తగినంత భద్రతా చర్యలను ఏర్పాటు చేయాలని కోరారు. పిజి మెడికల్ విద్యార్థినిపై క్రూరమైన ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లప్ప, పులిపాటి వెంకటేష్, నరహరి గౌడ్, డిటిడిసి నర్సింహులు, తుమ్మల నర్సింహులు, కొటేష్,అల్వాల రాజశేఖరరెడ్డి, భాస్కర్ యాదవ్,జనార్ధన్ రెడ్డి, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,రంజిత్ కుమార్,మాజీ సింగిల్ విండో చైర్మన్ సీసల్ వెంకట్ రెడ్డి,గోపాల్ వర్మ,కేడిఆర్ మధు,కుర్వ శ్రీనివాసులు,ఆనంద్ గౌడ్,డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు

## సెలవులోకి వెళ్లిన గద్వాల్ సీఐ



గద్వాల సీఐ భీంకుమార్

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(ప్రభాత ఉదయం) వ్యక్తిగత పనులపై గద్వాల్ సీఐ భీంకుమార్ సెలవులోకి వెళ్లినట్లు సమాచారం. కాగ రాజకీయ ఒత్తిళ్లతోనే సీఐ సెలవు పై వెళ్లినట్లు గద్వాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బదిలీలో భాగంగా గద్వాల సీఐగా భీంకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం గద్వాల సీఐ గా భీంకుమార్ అలాగే కొనసాగారు. గెలిచిన అభ్యర్థి, ఓడిన అభ్యర్థి ఇద్దరు ఒకే పార్టీలో రెండు వర్గాలు ఉండడంతో అధికారులు గద్వాల నియోజకవర్గంలో పని వేయాలంటే కత్తి మీద సాములా మారింది. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన అనంతరం పోలీస్ డిపార్ట్మెంట్ శాఖలో అందరు మార్పులు చేర్పులయ్యాయి. ఎస్ఐ స్థాయి నుండి ఎస్పీ స్థాయి వరకు మార్పులు చేర్పులు అయ్యాయి. కాగ ప్రతి పక్ష బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్లమెంటు ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం తారస్థాయికి చేరింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత గద్వాల ఎమ్మెల్యే బండ్ల, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య అంతర్గత విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయి. దీంతో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో ఆధిపత్య పోరుతో అధికారులు గద్వాల లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎవరిని వెంట పెట్టుకోవాలో, పర్యటనకు వచ్చినప్పుడు ఎవరి ఇంటికి వెళ్లాలో తెలియక రాష్ట్ర స్థాయి ప్రజాపత్రినిధులు సైతం గద్వాల పర్యటన కు వెళ్లాలో లేదో అయోమయ పరిస్థితి నెలకొంది. అధికారులు లోలోన సతమవతున్నట్లు తెలుస్తోంది. నడిగడ్డ అధికార పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలకు అధిష్టానం చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి.

### కాంగ్రెస్ లో అధిపత్య పోరు... పరస్పర కేసులు

అధికార కాంగ్రెస్ పార్టీలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీచైర్ పర్సన్ సరిత మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుకుంది. బీఆర్ఎస్ పార్టీనుంచి గెలుపొందిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరికను చివరి వరకు అడ్డుకోగా.. అధిష్టానం నచ్చజెప్పడంతో ఆమె వెనక్కి తగ్గారు. కాగ ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు ర్యాలంపాడు, గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు సందర్శనలకు గద్వాలకు పర్యటించిన సమయంలో మంత్రి జూపల్లి కాన్వాయ్ ను మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయులు అడ్డుకోవడం తీవ్ర దుమారం లేపింది. అంతే కాకుండా గట్టు ఎత్తిపోతల పథకం పర్యటనలో భాగంగా గద్వాల ఎమ్మెల్యే బామర్ది మోహన్ రెడ్డి వాహనాన్ని సరిత వర్గీయులు ధ్వంసం చేశారంటూ సరిత వర్గీయులపై గట్టు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అదే విధంగా సరిత వర్గీయులకు చెందిన వారి బంగారు ఆభరణాలు, కారు ధ్వంసం చేశారంటూ గద్వాల ఎమ్మెల్యే వర్గీయులపై కేసులు నమోదు చేశారు. గట్టు పోలీస్ స్టేషన్ లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల వర్గీయులు 9 మందిపై, సరిత వర్గీయులు 7మందిపై కేసులు నమోదయ్యాయి. అదే విధంగా గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ లో సరిత వర్గీయులు ఇద్దరితోపాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. గద్వాల పోలీస్ స్టేషన్ లో సరిత వర్గీయులపై సుమోటగా కేసు నమోదైనట్లు తెలుస్తోంది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత వర్గీయులపై పరస్పరం కేసులు నమోదు కావడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. దీనిపై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ ను వివరణ కోరగా గద్వాల సీఐ భీంకుమార్ వ్యక్తిగత పనులపై సెలవుపై వెళ్లినట్లు తెలిపారు.



పదోన్నతి పొందిన విద్యుత్ సిబ్బందిని సన్మానించిన అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్

## ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది పని చేయాలి

**షాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ పదోన్నతి పొందిన విద్యుత్ సిబ్బంది విధుల్లో చేరిక**

షాబాద్, ఆగస్టు21(ప్రభాత ఉదయం) ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా విద్యుత్ సిబ్బంది పనిచేసి మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని షాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ సూచించారు. బుధవారం లైన్ మాన్ గా విధులు నిర్వహిస్తున్న మాణిక్యం లైన్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది చిలుకూరు సెక్షన్ కు బదిలీ అయ్యారు. షాబాద్ సెక్షన్లో జూనియర్ లైన్ మ్యాన్లుగా పనిచేస్తున్న లక్ష్మణ్, రాకేష్, బి శివకుమార్, నరసింహ, ప్రవీణ్, సాజిద్, రమేష్ లు అసిస్టెంట్ లైన్ మ్యాన్లుగా పదోన్నతి పొంది విధుల్లో చేరారు. పదోన్నతి పొందిన విద్యుత్ సిబ్బందిని అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ నరేందర్ మాట్లాడుతూ... అత్యవసర సేవలు అందిస్తున్న విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం మంచి వేతనాలు ఇస్తుందని, అందుకోసం సిబ్బంది విద్యుత్ వినియోగదారులకు సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులతో సిబ్బంది సఖ్యతతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## వ్యక్తిగత కారణాలతోనే గద్వాల్ సిఐ లీవ్‌పై వెళ్లారు

**గద్వాల డిఎస్పి సత్యనారాయణ ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు**




గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు21(ప్రభాత ఉదయం)గద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న బీమ్ కుమార్ వ్యక్తిగత కారణాలతోనే సెలవు పై వెళ్లారని, లీవ్ లో వెళ్ళడానికి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని గద్వాల డీఎస్పీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గద్వాల్ సీఐ సోదరుడికి పెరాలసిస్ స్ట్రోక్ రావడం వల్ల కర్నూల్ లోని ఒక హాస్పటల్ నందు చికిత్స పొందుతున్నారని అందుకు సి ఐ మూడు రోజుల పాటు లీవ్ పై వెళ్ళడం జరిగిందనీ, ఇందులో ఎలాంటి రాజకీయ వత్తిళ్లు గానీ ,రాజకీయ కారణాలు గాని లేవని గద్వాల డీఎస్పి ప్రకటనలో పేర్కొన్నారు.



## టెక్కలయ్య దర్గా వద్ద కొనసాగుతున్న సిసి రోడ్డు పనులు

**పరిశీలించిన మాజీ జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్,కో ఆప్షన్,బిఆర్ఎస్ నేతలు**

కొత్తకోట, ఆగస్టు 21(ప్రభాత ఉదయం): కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని టెక్కలయ్య దర్గా వద్ద కొనసాగుతున్న సిసి రోడ్డు పనులను మాజీ జడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్ పరిశీలించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్,కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్, 15వ వార్డు యూత్ అధ్యక్షులు ఎండి సాదిక్, బి ఆర్ ఎస్ నేత లక్ష్మన్న గారి రవీందర్ రెడ్డి,%ు=% ఫంక్షన్ హాల్ నిర్వాహకులు షబ్బీర్ అహ్మద్,దర్గా కార్యవర్గ సభ్యులు ఆలంపాష ఖాద్రి,సయ్యద్ ఇమ్రాన్ నజీర్ ఖాద్రి,ఖదీర్ ఖాద్రి,అజీమ్ ఖాద్రి తదితరులు పాల్గొని..జరుగుతున్న సిసి రోడ్ పనులను పరిశీలించారు.ఈనెల 25నుండి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో.. భక్తుల సౌకర్యార్థం దర్గా పీఠాధిపతుల విన్నపం మేరకు..సీసీ రోడ్డుకు మున్సిపల్ నిధులు మంజూరు చేసినందుకు కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్,కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్,15వ వార్డు యూత్ అధ్యక్షులు ఎండి సాదిక్ మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుఖేషిణి విశ్వేశ్వర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకున్న వడ్డేపల్లి

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు**

**శ్రీ పోచమ్మ ఆలయ పునర్మాణ పనులను సందర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...**

కూకట్‌పల్లి, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం) జగద్గిరిగుట్ట లోని శ్రీ పోచమ్మ ఆలయం పునర్నిర్మాణం సందర్భంగా మహేందర్ పిలుపుమేరకు పోచమ్మ ఆలయానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మిత్ర బృందం రాజేశ్వరరావు ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.ఎల్ ప్రసాద్, ప్రకాష్ గుప్తా, రమేష్ గుప్తా, బాబు గౌడ్ అంబాల మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

**కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**శంషిగూడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోర్ ను ప్రారంభించిన కార్పొరేటర్**

కూకట్‌పల్లి, ఆగస్టు 21 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గల శంషిగుడా ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న నీళ్ల బోర్ ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోర్ నిర్మాణం విజయవంతమై నీళ్లు రావాలని భగవంతుణ్ణి కోరుకునట్లు తెలిపారు. నీళ్లు పడితే స్కూల్ అవసరాలకు, పిల్లలకు నీటి కొరత ఉండదని అన్నారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, హైస్కూల్ ప్రిన్సిపాల్ టి.నరసింహులు, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సుందరరావు, జి.నరసింహులు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.